సాక్షి
విశాఖపట్నం
మంగళవారం। 14। మార్చి। 2023



ఆనందంగా.. ఆరోగ్యంగా

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తున్నారు. 8లో



చిరుధాన్యాలతో అపు'రూపాలు'

వృత్తిరీత్యా విజయ్‌కుమార్ రైల్వే ఉద్యోగి. చిరుధాన్యాలతో అపురూప చిత్రాలు వేస్తూ ఆకట్టుకుంటున్నాడు. 8లో



నాయకత్వ లక్షణాలు అవసరం

జైలు సిబ్బందిలో నాయకత్వ లక్షణాలు మరింత మెరుగుపడాలని ఏపీ జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ సూచించారు. 10లో

ఓటెత్తిన పట్టభద్రులు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల జోరు
- ఉదయం నుంచే కేంద్రాల వద్ద రద్దీ
- సాయంత్రం 4 తర్వాత భారీ క్యూలు
- ఆవరణలో ఉన్న అందరికీ ఓటేసే అవకాశం
- 16న కౌంటింగ్
- గెలుపుపై ఎవరి అంచనాలు వారివే..
- 69.21 శాతం పోలింగ్ నమోదు

ఎండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పట్టభద్రులు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే భారీ సంఖ్యలో కేంద్రాలకు తరలివచ్చి ఓటు ప్రాధాన్యతను తెలిపారు. బ్యాలెట్ పేపర్ భారీ సైజులో ఉండటంతో ఓటు వేయడానికి ఒక్కో ఓటరుకు చాలా సమయం పట్టింది. అయినప్పటికీ పట్టభద్రులు సహనం కోల్పోలేదు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా క్యూలో నిల్చుని ఓటేసి కానీ వెనుదిరగలేదు. పురుషులతోపాటు మహిళా పట్టభద్రులూ పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 69.21 శాతం పోలింగ్ నమోదైంది.

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు భారీగా కదిలిరావడంతో అంచనాలకు మించి రికార్డుస్థాయిలో ఓటింగ్ నమోదైంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న 37 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. ఆది నుంచి ఓటమి భయంతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్న టీడీపీ, బీజేపీ శ్రేణులు.. పోలింగ్ రోజున కూడా అదే తీరుని కనబరిచారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అనేక పోలింగ్ బూత్‌ల వద్ద తమ మద్దతు అభ్యర్థుల ఫొటోలు, పేర్లతో ఉన్న కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఓటర్లను చివరి నిమిషం వరకూ ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు. మొత్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో 69.21 శాతం, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 69.37 శాతం పోలింగ్ నమోదైంది. మంత్రి అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో సహా ప్రజాప్రతినిధులు, అధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా ఈనెల 16న కౌంటింగ్ జరగనుంది.

మందకొడిగా మొదలై..

సోమవారం ఉదయం 8 గంటల నుంచి జిల్లాలో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. 9 గంటలకు కార్యాలయాలకు, విధులకు వెళ్లే ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో ఓటింగ్ క్రమంగా ఊపందుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు బారులు తీరారు. పర్మిషన్స్ తీసుకొని ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు తరలిరావడంతో మధ్యాహ్నం నుంచి ఓటింగ్ ఒక్కసారిగా ఊపందుకుంది. అనంతరం.. సాయంత్రం సమయంలోనూ అదే రీతిలో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్రాలకు చేరుకున్నారు. నిబంధనల మేరకు 4 గంటలలోపు కేంద్రాలకు వచ్చిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించారు. వారికి ప్రత్యేకంగా నంబర్లు కేటాయించి.. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. 4 గంటల తర్వాత కూడా ఓటు వేసేందుకు చాలా మంది వచ్చినా గేట్లు మూసివేయడంతో నిరాశగా వెనుదిరిగారు. మొత్తంగా ఉదయం నుంచి ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో రాత్రి 8 గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా కొన్ని కేంద్రాల్లో జనరేటర్లు ఏర్పాటు చేశారు.

నిరంతర పర్యవేక్షణ

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఓటింగ్‌ను వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పరిశీలించారు. పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఓటర్లతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినట్లు కనిపించినా.. వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులకు సూచనలందించారు.

ప్రతిపక్షాల ఉల్లంఘనలే..

సాధారణంగా ఎన్నికలు జరిగినప్పుడు అధికారంలో ఉన్న పార్టీ కాస్తా దూకుడుగా వ్యవహరిస్తుంటుంది. కానీ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం పూర్తి విరుద్ధంగా కనిపించింది. పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, మద్దతుదారులు సంయమనంగా వ్యవహరించారు. ఓటర్లకు స్లిప్పులు అందించడం.. వారికి పోలింగ్ బూత్‌ల వివరాలు తెలపడం వరకు మాత్రమే పరిమితమయ్యారు. కానీ.. టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్ మాత్రం ఏ పోలింగ్ స్టేషన్ వద్ద చూసినా ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కారు. తమ అభ్యర్థికి ఓటు వేయాలంటూ.. టీడీపీ ఏజెంట్లు, అనుచరులు ఓటర్లను చివరి నిమిషం వరకూ ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు. కరపత్రాలు చేతిలో పట్టుకొని.. అభ్యర్థి ఫొటో, సీరియల్ నంబర్ చెబుతూ కండువాలతో హడావిడి చేశారు. అదేవిధంగా.. బీజేపీ ఏజెంట్లు, అనుచరులు ఏకంగా ప్లకార్డులు పట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద ప్రదర్శనలు నిర్వహించారు. పీడీఎఫ్ అభ్యర్థులు కూడా అదే బాటలో పయనించారు.

స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులకు సీల్ వేసి.. పోలీసు భద్రత నడుమ ఎన్నికల అధికారులు, సిబ్బంది కలిసి ప్రత్యేక వాహనాల్లో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆయా జిల్లాలకు కేటాయించిన స్ట్రాంగ్‌రూమ్స్‌లో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకూ కొన్ని ప్రాంతాల నుంచి బాక్సులు వచ్చాయి. ఈ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జేసీ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పర్యవేక్షించారు.



ఓటేసిన అనంతరం మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ అభ్యర్థులు సీతంరాజు సుధాకర్, పి.వి.ఎన్.మాధవ్

ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో పోలైన ఓట్లు ఇలా..

జిల్లా పేరు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
శ్రీకాకుళం	52,256	37,417	71.60
విజయనగరం	58,502	43,862	74.98
పార్వతీపురం మన్యం	18,520	13,619	73.54
అల్లూరి సీతారామరాజు	11,525	8,362	72.56
విశాఖపట్నం	1,05,697	65,472	61.94
అనకాపల్లి	42,714	31,442	73.61
మొత్తం	2,89,214	2,00,174	69.21



ఓటేస్తున్న నగర మేయర్ హరివెంకట కుమారి



కృష్ణా కళాశాల వద్ద ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

భారీగా పెరిగిన ఓటర్లు

గతసారి అంటే 2017లో జరిగిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 1,55,930 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆ ఓటర్ల సంఖ్య 2,89,214కి పెరిగింది. ఆ ఎన్నికల్లో 69.78 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి స్వల్పంగా (69.21కి) తగ్గింది.



గాజువాక జెడ్పీ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద..



ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు



ఓటు వేస్తున్న పట్టభద్రులు

న్యూస్‌రీల్

నేడు వన్డే మ్యాచ్ టికెట్ల విక్రయం

నగరంలో మూడు కౌంటర్లు



విశాఖ స్పోర్ట్స్: భారత్– ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈనెల 19న వైఎస్సార్ స్టేడియంలో జరగనున్న వన్డే మ్యాచ్ టికెట్లను మంగళవారం విశాఖలో ఏర్పాటు చేసిన మూడు కౌంటర్లలో విక్రయించనున్నారు. ఆన్‌లైన్ ద్వారా విక్రయించిన టికెట్లు హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోగా స్థానికంగా అభిమానుల కోసం వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్, కొత్తరోడ్‌లోని మున్సిపల్ స్టేడియం, గాజువాకలోని రాజీవ్‌గాంధీ క్రీడాప్రాంగణంలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. టికెట్ కనీస ధర రూ.600లు కాగా రూ.1,500, రూ.2,000, రూ.3,000, రూ.3,500, రూ.6,000ల టికెట్లను ఉదయం 10 గంటల నుంచి విక్రయిస్తారు.

నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. జిల్లాలో 6,40,000 మందికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. ఏడాది నుంచి 19 ఏళ్ల బాలబాలికలతో ఈ మాత్రలు మింగించాలన్నారు. మంగళవారం సాధ్యమైనంతవరకు అందరికీ పంపిణీ చేస్తామని..తప్పితే ఈనెల 18న మరోమారు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సమత, పూర్ణేంద్ర బాబు, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, కన్సల్టెంట్ డా.హీనా దీక్షిత్ పాల్గొన్నారు.

గైస్ ప్రిన్సిపాల్‌కు అంతర్జాతీయ అవార్డు



మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్గనైజ్డ్ రీసెర్చ్ సంస్థ ఆయన్ని ఇంటర్నేషనల్ డిస్టింగ్విస్డ్ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేసింది. ఆన్‌లైన్‌లో ఆయనకు ఈ అవార్డు అందించగా అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని పోస్టల్ ద్వారా సోమవారం పంపించారు. గతంలో ఆయన గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్ అవార్డులను అందుకున్నారు.

పోర్టులో నేషనల్ డిఫెన్స్ కాలేజ్ బృందం



మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ రామమోహనరావు

దొండపర్తి : నేషనల్ డిఫెన్స్ కాలేజ్ బృందం సోమవారం విశాఖ పోర్ట్ అథారిటీని సందర్శించింది. 17 మంది సభ్యులతో కూడిన ఈ బృందానికి పోర్టు చైర్మన్ కె.రామమోహనరావు స్వాగతం పలికారు. అనంతరం పోర్టు పరిపాలనా కార్యాలయంలోని బోర్డ్ రూంలో సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోర్టులో మౌలిక వసతులు, ఎగుమతులు, దిగుమతులకు ఉన్న అవకాశాలు చైర్మన్ వివరించారు. పోర్టులో ఆధునికీకరణ, యాంత్రీకరణ అంశాలు, వంద శాతం సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్న తీరు, పెట్టుబడి అవకాశాలను విశదీకరించారు.

16న స్పెషల్ డ్రైవ్

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో ఉపాధి కల్పనకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ విశాఖ జిల్లా అధికారి సాయి కృష్ణచైతన్య తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన 18–45 ఏళ్ల మధ్య గల యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చిన అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 16వ తేదీన కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే ఎంపిక కార్యక్రమానికి తమ సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు. వివరాలకు 9908799126 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అభివృద్ధికే పట్టభద్రులు పట్టం కడతారు..



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన వై.వి.సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రులు అభివృద్ధికే పట్టం కడతారని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు తథ్యమని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా.. నిజాయితీదే అంతిమ విజయమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా విద్యావంతులంతా వైఎస్సార్‌సీపీకే మద్దతు పలికారన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఉన్నారు.

ఫలించిన ముందస్తు చర్యలు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు
- వృద్ధులు, దివ్యాంగులకు చేదోడు
- సీపీ శ్రీకాంత్ నిరంతరం పర్యవేక్షణ, పోలింగ్ కేంద్రాల సందర్శన

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లాలో 112 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ నిరంతరం పర్యవేక్షిస్తూ, పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

సత్ఫలితాలిచ్చిన బందోబస్తు చర్యలు : ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగేందుకు పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. ముగ్గురు డీసీపీలు, ఇద్దరు ఏడీసీపీలు, 10 మంది ఏసీపీలు, 21 మంది సీఐలు, 83 మంది ఎస్‌ఐలు, 201 మంది ఏఎస్ఐ/హెచ్‌సీలు, 405 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 142 మంది మహిళా కానిస్టేబుళ్లు, 148 మంది హోం గార్డులు, 133 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది ఇలా మొత్తంగా 1200 మంది పోలీస్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టింది. 12 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో ఎన్నికల తీరును పరిశీలించారు. 6 షాడో బృందాలతో నిఘా పెట్టారు.

వృద్ధ, దివ్యాంగ ఓటర్లకు తోడుగా..

ఒకవైపు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే.. మరోవైపు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు చేదోడుగా నిలిచారు.

స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచెల భద్రత

బ్యాలెట్ బాక్స్‌లను స్వర్ణభారతి ఆడిటోరియంలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. అక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు సీపీ శ్రీకాంత్ తెలిపారు.



ఏర్పాట్లను తెలుసుకుంటున్న సీపీ శ్రీకాంత్



ఓటు వేసేందుకు వచ్చిన దివ్యాంగులకు సాయపడుతున్న పోలీసులు



ఓటు వేసేందుకు వృద్ధుడ్ని తీసుకొస్తున్న పోలీసులు, గోపాలపట్నంలో చిన్నారిని లాలిస్తున్న కానిస్టేబుల్

నేత్ర వైద్యశాలలో గ్లకోమా స్క్రీనింగ్



స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న డాక్టర్ పి.విశ్వామిత్ర

సీతంపేట: ప్రపంచ గ్లకోమా వారోత్సవాలలో భాగంగా రామాటాకీస్ రోడ్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సోమవారం గ్లకోమా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వామిత్ర కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ నెల 18 వరకు గ్లకోమా సంబంధిత ఇబ్బందులు ఉన్నవారు నేత్ర వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఫీ'జులుం'

- బకాయిలు చెల్లిస్తేనే హాల్ టికెట్లు
- పరీక్షల వేళ విద్యార్థులపై ఒత్తిడి
- ఆందోళనలో ఇంటర్ విద్యార్థులు

విశాఖ విద్య :

- ఆశీల్ మెట్టలో గల ఓ కార్పొరేట్ కాలేజీలో ఫీజు బకాయిలు ఉన్న విద్యార్థులను తరగతి గదుల్లో నిల్చోబెట్టారు. యాజమాన్యం ఆదేశాల మేరకు కాలేజీ అధ్యాపకులు వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి, ఫీజు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని విద్యార్థులపై ఒత్తిడి చేశారు.
- శ్రీనగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాల ముందు సోమవారం ఫీజు చెల్లింపు కోసం విద్యార్థులు క్యూ కట్టారు. బకాయిలకు హాల్ టికెట్లు ముడిపెట్టడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను తీసుకొని కాలేజీకి వచ్చారు. రూ.2 వేలు ఉన్న బకాయి కూడా ముక్కుపిండి వసూలు చేశారు. దీంతో బకాయి కట్టని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఫీజుల బకాయిలతో సంబంధం లేకుండా ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. బకాయిల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేయవద్దని ఆదేశించింది. జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యాలు ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. పరీక్షల వేళ బకాయిలు వసూళ్లే ధ్యేయంగా విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. ఇలాంటి కాలేజీలపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఆరా తీస్తున్నారు.

విద్యార్థులకు అండగా టోల్ ఫ్రీ నంబర్

హాల్ టికెట్లు పొందే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే, నేరుగా ఫిర్యాదు చేసేలా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు టోల్ ఫ్రీ నంబర్ ను అందుబాటులో ఉంచారు. 18004257635 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే, వారి పేర్లు గోప్యంగా ఉంచి, సమస్య పరిష్కరించేలా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. అదే విధంగా విశాఖలో ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 0891–2567561 అనే నంబర్‌కు ఫిర్యాదు చేసి, తమ ఇబ్బందులను చెప్పుకోవచ్చు.



విశాఖలోని ఆర్ఐవో కార్యాలయం

హాల్ టికెట్లు ఇవ్వకుంటే గుర్తింపు రద్దు చేస్తాం



ఇంటర్మీడియట్ విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాల్సిందే. ఫీజు బకాయి కోసం విద్యార్థులను తరగతి గదుల్లో నిల్చోబెట్టడానికి వీల్లేదు. విద్యార్థులను ఫీజు కోసం ఒత్తిడి గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినట్‌లైతే, అలాంటి కాలేజీల గుర్తింపు రద్దు చేస్తాం.

– పి. ఉమారాణి, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

విద్యార్థులను ఇబ్బంది పెడితే సహించేది లేదు



పరీక్షల సమయంలో ఫీజు బకాయి వసూలు కోసమని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు. హాల్ టికెట్ ఇవ్వకుండా వేధిస్తే, అలాంటి కాలేజీలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయవచ్చు. అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచి, కమిషన్ విచారణ చేపడుతుంది. రుజువైతే కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలకు కమిషన్ సిఫారసు చేస్తుంది.

– డాక్టర్ జీ. సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఉత్తరాంధ్ర వైకుంఠధామంగా శ్రీవారి ఆలయం



వెంకన్న ఆలయంలో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



ఆలయ ప్రాంగణంలో వైభవంగా తిరుచ్చి ఉత్సవం

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

కొమ్మాది : రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఉత్తరాంధ్ర వైకుంఠధామంగా వెలుగొందుతుందని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. సోమవారం శ్రీవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. దేశంలోనే అందమైన సాగరతీరాన సాక్ష్యాత్తు తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడు కొలువయ్యాడని అన్నారు. విగ్రహం ప్రతిష్ఠించి ఏడాది కాలంలోనే ఓ దివ్య క్షేత్రంగా విరజిల్లుతుందని, రోజూ వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారన్నారు. మూడు జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులతో పాటు అనేక రంగాలకు చెందిన ప్రముఖులు శ్రీవారిని దర్శించుకుని తన్మయత్వం పొందుతున్నారన్నారు. రాష్ట్రం బాగుండాలని, రాష్ట్రానికి అనేక పెట్టుబడులు వచ్చేలా శ్రీవారు అనుగ్రహించాలన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూర్ణాహుతి, పుణ్యాహవచనం, హోమం, ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతకలశస్నపనం, అక్షతారోపనం, తిరుచ్చి ఉత్సవం నిర్వహించినట్లు తెలిపారు. టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ శ్రీవారి ఆలయంలో వచ్చే ఏడాది నుంచి తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవం దగ్గర నుంచి అన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో ఈ ఆలయం చిన్న తిరుపతిగా ప్రసిద్ధి పొందుతుందన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జేఈవో వీరబ్రహ్మం, ఏఈఓ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సూర్యనారాయణ రాజు, శేషబాబు పాల్గొన్నారు.

పోలింగ్ చిత్రాలు


తొలిసారి ఎమ్మెల్సీ ఓటు వేస్తున్న పట్టభద్రులు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులంతా ఉత్సాహంగా ఓటు వేశారు. ఓటర్లు గంటల తరబడి బారులు దీరారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. పోలింగ్ నిర్వహణలో జిల్లా అధికారులు సఫలీకృతులయ్యారు.


వేపగుంట జెడ్పీ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులుదీరిన ఓటర్లు


గాజువాకలో పోలింగ్ తీరును పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్


పెందుర్తిలో ఓటు వేసేందుకు వచ్చిన పట్టభద్రులు


కృష్ణా కాలేజ్ వద్ద ఓటరు స్లిప్పులు చూపిస్తూ...


పెందుర్తిలో క్యూలైన్‌లో ఓటర్లు


గుర్తింపు కార్డులు తనిఖీ చేస్తూ..


సెల్‌ఫోన్లను భద్రపరుస్తూ..


ఓటు వేసేందుకు ఉత్సాహంగా..


గాజువాక స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

ఓటర్ల జాబితాలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఓటు గల్లంతు

- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం


ఓటు గల్లంతు కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: తన ఓటు గల్లంతు కావడంపై ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. సోమవారం జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు చోడవరంలోని యూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 169 పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు ధర్మశ్రీ వచ్చారు. పోలింగ్ కేంద్రం బయట ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఓటర్ల జాబితాను పరిశీలించగా ఆయన పేరు లేదు. తన స్వగ్రామమైన చోడవరం మండలం అంభేరుపురంలో ఓటు హక్కు నమోదుకు వివరాలు అందించానని, తీరా జాబితాలో తన పేరున ఓటు నమోదు కాలేదన్నారు. తనతోపాటు తన కుటుంబసభ్యులైన 13మంది పేర్లు కూడా ఓటర్ల జాబితాలో లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానన్నారు.

చిరుధాన్యాలతో అపు'రూపాలు'

- చిత్రాలతో మెప్పిస్తున్న విజయ్‌కుమార్
- దేశ, విదేశీ ప్రముఖులను మెప్పించిన వైనం


సీంకు చిత్రపటం బహూకరిస్తున్న మంత్రి అమర్‌నాథ్ (ఫైల్)

ఏయూక్యాంపస్ : వృత్తిరీత్యా అతను రైల్వేలో గ్రేడ్ వన్ టెక్నీషియన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచి చిత్రకళపై ఉన్న ఆసక్తితో చిత్రకారుడిగా మారారు. విభిన్న రూపాలను హృద్యంగా కుడ్యంపై తీర్చిదిద్దడం అతని ప్రత్యేకత. విశాఖకు చెందిన మోకా విజయ్ కుమార్‌ది చిత్రకళలో అందెవేసిన చేయి. సాధారణ చిత్రకారుడిగా ఉండకుండా తనకంటూ ఒక ప్రత్యేకత, గుర్తింపును సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా చిరుధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి తీర్చిదిద్ది శభాష్ అనిపించుకున్నారు.

సిరిధాన్యాలతో చిత్తరువులు

2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ప్రజలకు చిరుధాన్యాలపై విస్తృత అవగాహన కల్పించే విధంగా విజయ్ కుమార్ ఆలోచించారు. సిరిధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. జొన్నలు, అరికలు, గంట్లు, రాగులు, నువ్వులు ఉపయోగించి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన రెడ్డిలతో పాటు, ముఖేష్ అంబాని, ఆనంద్ మహేంద్ర, సత్యనాదెండ్ల, ఆదానీ, నటరాజన్ చంద్రశేఖరన్, సుందర్‌పిచాయ్, ఆది గోద్రెజ్, కుమార మంగళం బిర్లా, ఎలాన్ మస్క్, టిం కుక్ వంటి అంతర్జాతీయ సంస్థల సీఈవోల చిత్రపటాలను తీర్చిదిద్దారు. ఎటువంటి వర్ణాలు అద్దకుండా కేవలం చిరుధాన్యాల గింజలను ఉపయోగించి ఎంతో ఆకర్షణీయంగా వీటిని తయారు చేశారు. ఒక్కో చిత్రపటం తయారు చేయడానికి పక్షం రోజులకు పైగా పట్టిందని విజయ్ కుమార్ చెప్పారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో..

విశాఖలో ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో విజయ్ కుమార్ తయారు చేసిన ప్రముఖుల చిత్రపటాలను ప్రదర్శించారు. రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్‌లు వీటిని పరిశీలించి విజయ్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటాన్ని స్వయంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విజయవాడ తీసుకువెళ్లి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డికి బహూకరించారు.

విదేశాలలో ప్రదర్శనలు

2017లో తానా వారి ఆహ్వానం మీద అమెరికాలో సెయింట్ లూయిస్‌లో విజయ్ కుమార్ ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. 2019 అట్లాంటాలో చిత్రకళను చిన్నారులకు 45 రోజులు బోధించారు. 2021లో ఆన్‌లైన్‌లో అమెరికా, భారతీయ విద్యార్థులకు చిత్రకళపై ఆన్‌లైన్‌లో ప్రత్యేక తరగతులను నిర్వహించారు. 2022లో న్యూజెర్సీలో తెలంగాణ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అమెరికాలో ప్రత్యేక ప్రదర్శన, శిక్షణ తరగతులను విజయ్‌కుమార్ నిర్వహించారు. రైల్వే కార్యాలయంలో పలు ప్రాంతాలను తన చిత్రాలతో కళాత్మకంగా గతంలో తీర్చిదిద్దారు.

కొత్తగా ప్రయత్నించా...



ప్రజల్లో అవగాహన కల్పించాలని, చిరుధాన్యాలపట్ల ప్రజల్లో చైతన్యం పెంచే విధంగా ఈ ప్రయత్నించా..కాదేదీ కళలకు అనర్హం అన్న చందంగా చిరుధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను తయారు చేశా. వీటిని మంత్రులు వీక్షించి ప్రశంసించారు. భవిష్యత్తులో సమాజానికి సందేశాన్నందించే మంచి చిత్రాలను తీర్చిదిద్దుతా..

– మోకా విజయ్ కుమార్, చిత్రకారుడు

39 వాహనాలపై కేసులు


మద్దిలపాలెం జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): జిల్లా పరిధిలో ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. మద్దిలపాలెం, శీలానగర్ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 39 వాహనాలపై కేసులు నమోదు చేశారు. 5 వాహనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు బాలాజీ, పి.శిరీష, ఏఎంవీఐలు పాల్గొన్నారు. స్పెషల్ డ్రైవ్ నిత్యం కొనసాగుతాయని ఉపరవాణా కమిషనర్ రాజా రత్నం తెలిపారు. ఫ్యాన్సీ నంబర్ల ప్లేట్లతో ఉన్న వాహనదారులు హైసెక్యూర్టీ ప్లేట్లను అమర్చుకోవాలని సూచించారు.

కార్గోలో అనకాపల్లి డిపోకు ప్రథమ స్థానం


ఆర్టీసీ గ్యారేజీని పరిశీలిస్తున్న జోనల్ ఈడీ

అనకాపల్లి టౌన్: ప్రజారవాణాశాఖ విజయనగరం జోన్ పరిధిలో కార్గో ఉత్పత్తిలో ఈ ఏడాది అనకాపల్లి డిపో ప్రథమ స్థానంలో నిలిచిందని జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్ చెప్పారు. స్థానిక ఆర్టీసీ డిపోను ఆయన సోమవారం సాయంత్రం సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి, నర్సీపట్నం డిపోలకు చెందిన 20 బస్సులకు కాలం చెల్లడంతో విజయనగరం వర్క్‌షాపుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటి స్థానంలో నూతనంగా 8 బస్సులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. మిగిలిన బస్సులను ఈనెలాఖరునాటికి డిపోలకు అప్పగిస్తామన్నారు. ఉగాదికి కొత్త టార్గెట్‌లను ప్రవేశపెడతామని తెలిపారు. కార్గో ద్వారా ఆర్టీసీకి మంచి ఆదాయం సమకూరుతోందని, వ్యాపారస్తులతో పాటు వివిధ వర్గాలవారు ప్రజారవాణాశాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాశాఖాధికారి కె.పద్మావతి, డిపో మేనేజర్ ఎస్.సుజాత, ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ఆనందంగా.. ఆరోగ్యంగా

- బడి పిల్లలకు బలవర్ధక ఆహారం
- ఈ నెల 21 నుంచి రుచికరమైన రాగిజావ అందజేత
- రక్తహీనత నివారణకు ఎంతో మేలు
- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- మంగళ, గురు, శనివారం రాగిజావ
- సోమ, బుధ, శుక్రవారాల్లో పసందైన చిక్కీ
- విశాఖ జిల్లాలో 587 పాఠశాలల్లో అమలు
- 87,792 మందికి ప్రయోజనం
- స్కూళ్లకు చేరిన రాగిజావ, బెల్లం పొడి ప్యాకెట్లు


మధురానగర్‌లో చిక్కీ చూపిస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి రాగిజావ అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారంలో మూడు రోజులు (మంగళ, గురు, శనివారం) విద్యార్థులకు రాగిజావ ఇవ్వనున్నారు. పరిశుభ్రంగా, విద్యార్థులు ఇష్టపడే రీతిలో రుచికరంగా దీనిని తయారు చేసి ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు దీనిపై దృష్టి సారించారు. ఈ వంటకానికి అవసరమైన రాగి, బెల్లం పొడి ప్యాకెట్లను జిల్లాలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేశారు.

జిల్లాలో 588 పాఠశాలల్లో..

విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 587 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తుండగా, 87,792 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు.

ఇందులో 388 పాఠశాలల్లోని 47,010 మంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం అందిస్తున్నారు. బాలికల్లో రక్త హీనత నివారణకు రాగిజావ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో దీనిని పటిష్టంగా అమలు చేసేలా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దష్టి సారించారు.

వంట ఏజెన్సీలకు గిట్టుబాటయ్యేలా..

రాగిజావ తయారీపై ఇప్పటికే పాఠశాల హెచ్‌ఎంల ద్వారా వంట ఏజెన్సీల వారికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 976 మంది వంట నిర్వాహకులు పని చేస్తుండగా, వీరికి టీడీపీ హయాంలో నెలకు రూ. 1000 మాత్రమే ఇచ్చేవారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వీరి గౌరవ వేతనం రూ. 3 వేలకు పెంచింది. దీంతో పాటు పెరిగిన నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా భోజన పథకం నిర్వహణకు నిధులు చెల్లిస్తుండటంతో వంట నిర్వాహకుల కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. దీంతో వారు విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా ఆయాలను సైతం నియమించారు. జిల్లాలో 664 మంది ఆయాలు పని చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆయాల నియామకం జరిగింది. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ. 6 వేలు వేతనం చెల్లిస్తున్నారు.



పాఠశాలలకు సరఫరా అయిన రాగిజావ పౌడర్ ప్యాకెట్లు, విద్యార్థులకు ఇవ్వనున్న రాగిజావ

ప్రస్తుతం అమల్లో ఉన్న మెనూ..

- సోమవారం – పొంగలి/బిర్యానీ, గుడ్డుకూర, వేరుసెనగ చిక్కీ
- మంగళవారం– పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు
- బుధవారం– కూరగాయలతో అన్నం, బంగాళ దుంప కూర్మా, ఉడికించిన గుడ్డు, వేరుసెనగ చిక్కీ
- గురువారం– సాంబార్ అన్నం/నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు
- శుక్రవారం– అన్నం, ఆకుకూర-పప్పు, ఉడికించిన గడ్డు, వేరుసెనగ చిక్కీ
- శనివారం– ఆకుకూర అన్నం, రసం, తీపి పొంగలి

అంతా సిద్ధం చేశాం

మధ్యాహ్న భోజనంతో పాటు రాగి జావ విద్యార్థులకు అందించేందుకు అంతా సిద్ధం చేశాం. దీనికి సంబంధించిన బెల్లం, రాగి పౌడర్ ప్యాకెట్లు అన్ని పాఠశాలలకు సరఫరా చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 21న జిల్లాలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం పటిష్టంగా అమలయ్యేలా పర్యవేక్షణ పెంచాం.

– ఎ.అరుణజ్యోతి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, విశాఖ జిల్లా.